www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 ఆగస్టు 2024
5
ఏలూరు

ఏలూరు త్రీ టౌన్ సిఐగా కోటేశ్వరరావు బాధ్యతలు

ఏలూరు స్పోర్ట్స్ : మహిళల సంరక్షణే ధ్యేయంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పని చేస్తానని ఏలూరు మూడో పట్టణ సిఐ వి.కోటేశ్వరరావు అన్నారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన కోటేశ్వరరావు 2021లో సిఐగా ఉద్యోగోన్నతి పొందారు. సిఐగా ఉద్యోగోన్నతి పొందిన తర్వాత మొట్టమొదటిగా ఆయన విజయవాడ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అనంతరం విజయవాడ ట్రాఫిక్‌లో పని చేశారు. విజయవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా మూడో పట్టణానికి బదిలీపై వచ్చారు. ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మూడో పట్టణ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ..!

గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన మంత్రి మండలి

ఉమ్మడి పశ్చిమలో మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిసిలు, ఒక ప్రాజెక్టు కమిటీ

మైనర్ ఇరిగేషన్‌లో వాటర్ యూజర్స్ అసోసియేషన్లు 222, ప్రాజెక్టు కమిటీలు రెండు

ప్రతి కమిటీలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నలుగురు సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ఆమోద ముద్రవేసింది. బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశం సాగునీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాజకీయ నాయకుల్లో హడావుడి మొదలైంది. సాగునీటి సంఘాల్లో పదవులకు ఎవరిని నియమించాలనే దానిపై ప్రజాప్రతినిధుల్లో చర్చ మొదలైంది. గడిచిన ఐదేళ్లుగా ఎన్నికల నిర్వహణ లేకుండా మగ్గిపోయిన సాగునీటి సంఘాలు ఇక ప్రజాప్రతినిధులతో కళకళలాడనున్నాయి. 2015లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఐదేళ్లకోసారి జరగాల్సిన ఈ ఎన్నికలు మళ్లీ ఇప్పటి వరకూ జరగలేదు. దీంతో మేజర్, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన ఎన్నో పనులు కుంటుపడిన పరిస్థితి నెలకొంది. సాగునీటి సంఘాలకు మూడు పద్ధతుల్లో ఎన్నికల నిర్వహణ ఉంటుంది. మేజర్, మైనర్ ఇరిగేషన్‌కు విడివిడిగా ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో వాటర్ యూజర్స్ అసోసియేషన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలు మొత్తం మూడు విధాలుగా ఉంటాయి. వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీల్లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, నలుగురు కమిటీ సభ్యులు ఉంటారు. వీరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికగా ఈ ఎన్నికలు జరగనున్నాయి. గోదావరి డెల్టా పరిధిలోని మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 222 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, రెండు ప్రాజెక్టు కమిటీలు ఉంటాయి. మైనర్ ఇరిగేషన్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు లేవు. మేజర్ ఇరిగేషన్ అంతా డెల్టా పరిధిలో ఉండగా, మైనర్ ఇరిగేషన్ అంతా మెట్ట ప్రాంతంలో ఉంది. మెట్టప్రాంతంలో తమ్మిలేరు, ఎర్రకాలువకు రెండు ప్రాజెక్టు కమిటీలు ఉంటాయి. సాగునీటి సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం జిఒ జారీ చేసిన తర్వాత ప్రక్రియ మొదలుకానుంది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో వాటర్ యూజర్స్ కమిటీల ఎన్నికలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. కమిటీలోని సభ్యుల ఎంపిక ప్రకియ అంతా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరగనుంది. ఎవరికి పదవులు ఇవ్వాలనే దానిపై స్థానికంగా ఎంఎల్‌ఎలు నిర్ణయం తీసుకుని జాబితా తయారు చేసి అధికారులకు పంపించే అవకాశం ఉంది.

ఎన్నికలు లేక పనులన్నీ పడక

సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగకపోవడంతో సాగునీటి వనరుల అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు పూర్తిగా పడకేశాయి. కాలువలు, చెరువులకు సంబంధించిన పూడికతీత పనులు, కాలువ గట్లు పటిష్టం చేసే పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. సాగునీటి సంఘాలు నీటితీరువా వసూలు చేసి నీటి వనరుల నిర్వహణకు ఖర్చు చేస్తాయి. కమిటీలు లేకపోవడంతో నీటి తీరువా వసూలు కూడా జరగని పరిస్థితి ఏర్పడింది. కనీసం డ్యామ్ గేట్లకు గ్రీజ్ వంటి పనులు కూడా చేయని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం అధికారికంగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోయినా.. అనధికారికంగా వైసిపి నాయకులకు ఈ పదవులు కట్టబెట్టింది. వీరిపై అధికారుల పర్యవేక్షణ అనేది లేకపోవడం గ్రామాల్లో ఇష్టానుసారంగా రైతుల నుంచి సొమ్ము వసూలు చేసి మింగేసిన పరిస్థితి నెలకొంది. కాలువల బాగుజేత పేరుతో ఎకరాకు రూ.వెయ్యి వరకూ వసూలు చేయడం, లెక్కలు చెప్పని పరిస్థితి ఉంది. చేపల చెరువుల యజమానులకు అండగా నిలబడుతూ వ్యవసాయం చేసే రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. సాగునీటి సమస్యలను పట్టించుకోకుండా అవినీతికి ఆలవంగా సాగునీటి సంఘాల పదవులను తయారు చేసిన పరిస్థితి నెలకొంది.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలి

అన్నింటిలో మాక్‌డ్రిల్ నిర్వహించాలి: కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విపత్తులను ఎదుర్కొనే ప్రణాళికలు ఉండాలి: ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించేందుకు ఆయా పారిశ్రామిక యాజమాన్యాలు, అధికారులతో బుధవారం కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి క్రైసెస్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అంతర్గత ఆడిట్ పూర్తయినట్లు తెలియజేస్తే ఆయా పరిశ్రమలను జిల్లాస్థాయి అధికారులు నిపుణులతో కూడిన కమిటీలు తనిఖీ చేసి భద్రతకు నిర్దేశిత ప్రమాణాల మేరకు అన్ని చర్యలు తీసుకునేది, లేనిదీ నిర్ధారిస్తాయన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు పూర్తి భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు భద్రతా చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించి ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా ఫ్యాక్టరీల్లో చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. పరిశ్రమలు, కార్మిక, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రెడ్ కేటగిరీల్లో ఉన్న పరిశ్రమల్లో రక్షణ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్, ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలన్నారు. తరచూ మాక్‌డ్రిల్ చేపట్టడం ద్వారా కార్మికులు, ప్రజల్లో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల్లో ఏర్పాటు చేసే అగ్నిప్రమాద నివారణ పరికరాలు సరైన రీతిలో పనిచేసేలా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి పరిశ్రమలో సేఫ్టీ అధికారిని ఏర్పాటు చేసుకుని వారికి జిల్లా అగ్నిప్రమాద నివారణ అధికారి వారు ఇచ్చే శిక్షణను పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరిశ్రమలు జిల్లా ఫైరాఫీసర్ వారి వద్ద ఎన్ఒసి పొందాలన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ ప్రతి పరిశ్రమలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఎలా స్పందించాలి, ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై ఒక స్పష్టమైన కంటింజెంట్ ప్రణాళిక ఉండాలన్నారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిషిఫ్టులో ఒకరు బాధ్యతాయుతమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పరిశ్రమల్లో వాహనాల ప్రవేశ మార్గాలకు సంబంధించి కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు పరిశ్రమల్లో కార్మికులను, చుట్టుపక్కల ప్రజలను అప్రమత్తం చేసేందుకు అలారం సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధ్‌రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.శ్రీనివాస్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ నజీనాబేగం, జిల్లా ఫైరాఫీసర్ సిహెచ్.రత్నబాబు, లీగల్ అండ్ మెట్రాలజీ జిల్లా కంట్రోలర్ వరప్రసాద్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ కె.బాబ్జి, ఆర్‌టిఒ శ్రీహరి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట, జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలి

లేకుంటే మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతాం

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆనాటి విద్యుత్ ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) (న్యూడెమోక్రసీ) పార్టీ ఆధ్వర్యంలో నిరసన బుధవారం కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్ద వెంకటరావు మాట్లాడుతూ 2000లో ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ రంగం ప్రయివేటీకరణ, సంస్కరణలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు పెద్దఎత్తున విద్యుత్ ఉద్యమాన్ని నిర్వహించాయని గుర్తు చేశారు. హైదరాబాద్ బషీర్బాగ్ వద్ద జరిగిన పోరాటంలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు యువకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి చనిపోయారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పోరాటాల్లో వేలాది మందికి పోలీస్ లాఠీ చార్జీల్లో గాయాలయ్యాయని, కాళ్లు, చేతులు విరిగాయని చెప్పారు. ఆ ఉద్యమం తర్వాత 15 ఏళ్ల పాటు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచే సాహసం చేయలేదని గుర్తు చేశారు. మళ్లీ తిరిగి 2019 నుంచి రాష్ట్రాన్ని పరిపాలించిన వైసిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో, ఆదానీ సంస్థ నుంచి స్మార్ట్ మీటర్లను దిగుమతి ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రజానీకంపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపిందన్నారు. గత ఎన్నికల ముందు తెలుగుదేశం, జనసేన కూటమి పార్టీలు తాము అధికారంలోకొస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకొచ్చిన రెండు నెలల్లోనే వైసిపి ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలపై రుద్దుతుందని విమర్శించారు. వైసిపి వదిలిన చెప్పుల్లో తెలుగుదేశం, జనసేన కూటమి కాళ్లు దూర్చిందని ఎద్దేవా చేశారు. ఇది ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే విద్యుత్ రంగంలో ట్రూ ఆప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, అదనపు ఛార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల రూపాయలు మోయలేని భారం గత ప్రభుత్వాలు మోపాయన్నారు. అవి తగ్గించకపోగా ఇప్పుడు ఆదాని సంస్థ స్మార్ట్ ఎటర్ల పేరుతో అదనపు భారం వేయడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌ను అందించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పేద, మధ్య తరగతి ప్రజానీకానికి విద్యుత్ ఛార్జీల స్లాబ్‌ల్లో ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో గత ప్రభుత్వం మాదిరిగానే విద్యుత్ ఛార్జీలను పెంచితే రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీలు మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రామకృష్ణ, బి.జగన్నాధరావు, సిహెచ్.పైడియ్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ) నాయకులు పల్లి గంగరాజు, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యవర్తిగా వస్తే...!

స్థల వివాదంలో సమీప బంధువు దారుణ హత్య

దంపతులకు తీవ్ర గాయాలు

మృతి చెందిన చేబత్తిన కృష్ణ

ప్రజాశక్తి - భీమడోలు

అర్జావారిగూడెంలో కుమార్తె, తండ్రి మధ్య తలెత్తిన ఆస్తి వివాదం మధ్యవర్తిగా వచ్చిన మేనమామను బలిగొంది. తడపల దుర్గారావు కుమార్తె పూజారాణి, మోజేస్ ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆస్తిగా ఉన్న ఒక ఇంటి స్థలం విషయంలో కుమార్తె, తండ్రి మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం దుర్గారావు కుమార్తె, ఆమె భర్తపై దుర్గారావు కుటుంబీకులు దాడి చేశారు. ఈ ఘర్షణలో పూజారాణి భర్తకు గాయాలయ్యాయి. దీంతో వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు పూజారాణి మేనమామ చేబత్తిన కృష్ణ ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న దుర్గారావు సోదరుడు వెంకటేశ్వరరావు ఇంట్లోకి వెళ్లి కోత కత్తి తెచ్చి వారిపై దాడి చేశారు. ఈ దాడిలో అక్కడే ఉన్న మధ్యవర్తి మేనమామ కృష్ణ అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడిన పూజారాణి, ఆమె భర్త మోజెస్‌ను 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూజారాణి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని భీమడోలు సిఐ రవికుమార్, ఎస్ఐ సుధాకర్ సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఫిట్ ఏలూరు జిల్లాగా మారాలి

29న 3కె రన్‌లో అంతా భాగస్వాములు కావాలి

ఉత్సాహంగా క్రీడా పోటీల్లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెసి పి.ధాత్రిరెడ్డి

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలు తమ రోజువారీ జీవితంలో శారీరక వ్యాయామం, క్రీడలను అభ్యాసం చేసి ఆరోగ్యంగా, ధృడంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ ఈ నెల 29న పుట్టిన రోజు సందర్భంగా వారం రోజులపాటు నిర్వహిస్తున్న క్రీడోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 'చురుకైన, ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించుకోవడానికి నా ఫిట్‌నెస్, ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 30 నిమిషాలు కేటాయిస్తానని.. నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేలా ప్రోత్సహిస్తాను' అని క్రీడాకారులు, ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా జిల్లావ్యాప్తంగా వారంరోజులపాటు క్రీడోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. అందులో భాగంగా పాఠశాలలు, హాస్టల్స్, కళాశాలల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ కూడా తీసుకుంటామన్నారు. ఈ నెల 26 నుండి 29వ తేదీ వరకు పలు క్రీడా పోటీలు నిర్వహించుకుంటున్నామని, అందులో అధికారులు, ప్రజలు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏలూరు నగరంలో 3కె రన్ నిర్వహిస్తున్నామని, అందులో నగర ప్రజలందరూ పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

క్రీడాపోటీల్లో ఉల్లాసంగా కలెక్టర్, జెసి

స్థానిక ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన పలు పోటీల్లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. వాక్‌రన్, షటిల్ పోటీల్లో వారు పాల్గొని అందరిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు. అనంతరం లెమన్ టీ స్పూన్ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, డిపిఒ టి.శ్రీనివాస విశ్వనాధ్, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, బిసి సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, డిసిపిఒ సూర్యచక్రవేణి, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ ఆర్డర్లు నిలిపివేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీలో 1/70, ఎల్‌టిఆర్, పీసా చట్టాలకు విరుద్ధంగా ల్యాండ్ కన్వెన్షన్ పేరుతో ఆర్‌డిఒ జారీ చేసిన ఆర్డర్లను తక్షణం నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో కొంతమంది గిరిజనేతరులు వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వెన్షన్ పేరుతో ఆర్‌డిఒ నుండి అనుమతులు తీసుకుని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వీటిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ ఇస్తున్న ల్యాండ్ కన్వెన్షన్ ఆర్డర్లు ఏజెన్సీ ప్రాంత చట్టాలకు పూర్తి విరుద్ధమని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్లాట్ల అమ్మకాలు తక్షణమే ఆపాలని, దీనిపై కలెక్టర్, ఐటిడిఎ పిఒ వెంటనే జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఏజెన్సీ ప్రాంతంలో అన్యాయానికి గురవుతున్న గిరిజనులను చైతన్యవంతుల్ని చేసి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పలుచోట్ల డెంగీ కేసుల కలకలం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన గాడిచర్ల శ్రీను కుమారుడు కుశ్వంత్‌సాయిమహి(10)కి గత మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబసభ్యులు తెలంగాణలోని భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తూ పరీక్షలు చేయగా డెంగీ నిర్ధా రణ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రిలోనే ఉంచమన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న బాలుడు ఆరోగ్యంగానే ఉన్నట్లు తండ్రి శ్రీను తెలిపారు.

ముదినేపల్లి :ముదినేపల్లికి చెందిన ఓ యువకుడు డెంగీ లక్షణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సదరు యువకుడు హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో సదరు యువకుడు జ్వరం బారిన పడ్డాడు. జ్వరం తగ్గకపోవడంతో వారం క్రితం హైదరాబాద్ నుంచి ముదినేపల్లిలోని ఇంటికి వచ్చాడు. దీంతో కుటుంబసభ్యులు యువకుడిని గుడివాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లడంతో వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించగా డెంగీ సోకినట్లుగా నిర్ధారణ అయింది. దీంతో యువకుడు గుడివాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

30న వన మహోత్సవం

జిల్లాలో లక్ష మొక్కలు నాటేలా కార్యాచరణ

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30న నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమంలో లక్ష మొక్కలు నాటేందుకు కార్యాచరణను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో వన మహోత్సవ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30న జిల్లాలోని ప్రతి గ్రామంలో 200 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఆదేశాలిచ్చిందన్నారు. జిల్లాలోని శనివారపుపేట, తడికలపూడి, నామవరం, ఫాతిమాపురం, బుట్టాయగూడెం, మర్లగూడెం, ఉంగుటూరు, వెంకట్రామన్నగూడెంల్లోని ఎనిమిది నర్సరీల నుంచి లక్ష మొక్కలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలతోపాటు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయవేత్తలు, విద్యా సంస్థలు, తదితర సభ్యులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలోను ఇంటింటికీ ఒకమొక్క నాటే విధంగా పాఠశాల ఆవరణలో రోడ్డుకి ఇరువైపులా పరిశ్రమల వద్ద తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్‌బిఐ క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలి

పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

భారతీయ రిజర్వ్ బ్యాంక్ క్విజ్ పోటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన జిల్లాలో కూడా డిగ్రీ చదువుతున్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. ఒక కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బాధ్యతాయుతమైన ఆర్థిక ప్రవర్తనను పెంపొందించుకోవడానికి యువతను ప్రోత్సహించడం, దాని ప్రజా అవగాహన ప్రచారాల ద్వారా డిజిటల్ ఫైనాన్షియల్ ఉత్పత్తులను సురక్షితమైన వినియోగానికి అలవాటు పడేలా చేయడం ఈ క్విజ్ ఉద్దేశమన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి మాట్లాడుతూ ఏ కళాశాల నుండైనా విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. https://www.rbi90quiz.in పేర్కొన్న వెబ్‌సైట్‌లో ప్రతిఒక్కరూ రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇద్దరు విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి క్విజ్ పోటీల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు వయో పరిమితి 25 సంవత్సరాలు మించి ఉండకూడదన్నారు. 01-09-1999 లేదా ఆ తర్వాత పుట్టిన వారికి మాత్రమే ఈ అవకాశమన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి కింద రూ.రెండు లక్షలు, రెండో బహుమతి కింద రూ.1.5 లక్షలు, మూడో బహుమతి లక్ష రూపాయలు ఉంటుందన్నారు. జోనల్ స్థాయిలో మొదటి బహుమతి కింద రూ.ఐదు లక్షలు, రెండో బహుమతి కింద రూ.నాలుగు లక్షలు, మూడో బహుమతి రూ.మూడు లక్షలు ఉంటుందన్నారు. జాతీయ ఫైనల్ పోటీల్లో మొదటి బహుమతి కింద రూ.పది లక్షలు, రెండో బహుమతి కింద రూ.ఎనిమిది లక్షలు, మూడో బహుమతి రూ.ఆరు లక్షలు ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లను సెప్టెంబర్ 17వ తేదీ లోపు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. దరఖాస్తు రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి ఉచితమని తెలుపుతూ, ఈ అవకాశాన్ని డిగ్రీ చదివే విద్యార్థులు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 3,83,373 క్యూసెక్కుల నీరు దిగువకు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 3,83,373 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 29.370 మీటర్లు, స్పిల్ వే దిగువన 19,820 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఇఇ పి.వెంకటరమణ తెలిపారు. ఎల్ఎన్‌డిపేట రిజర్వాయర్ నుంచి 120 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు.

బస్సు సర్వీస్ నిలిపివేతతో అవస్థలు

రాత్రి ఏడు గంటల బస్సును పునరుద్ధరించాలి ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

బస్సు కోసం ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్న వైనమిది. గుడివాడ ఆర్‌టిసి డిపో నుంచి రాత్రి ఏడు గంటలకు గుడివాడ నుంచి బంటుమిల్లికి బయలుదేరే బస్సు సర్వీసును ఇటీవల డిపో అధికారులు నిలుపుదల చేశారు. ఈ బస్సు గుడివాడలో రాత్రి ఏడు గంటలకు బయలుదేరి ముదినేపల్లి 7:30 గంటలకు చేరుకుంటుంది. ఆ సమయంలో బంటుమిల్లి వెళ్లేందుకు ముదినేపల్లి బస్‌స్టేషన్, గురజ రోడ్డు సెంటర్‌లో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉంటారు. అయితే గత కొన్ని వారాలుగా ఈ సర్వీస్‌ను డిపో అధికారులు నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు రాత్రిపూట బస్సు కోసం పడుతున్న అవస్థలు ఇన్ని అన్ని కావు. ఈ బస్సు రద్దుతో తర్వాత తొమ్మిదిన్నర గంటలకు వచ్చే పల్లెపాలెం నైట్ హాల్ట్ బస్సు కోసం ప్రయాణికులు రెండు గంటలు పైబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే రోగులు, మహిళలు, ట్యూషన్స్ నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు, వివిధ పనులపై ఉదయం బయటికు వెళ్లి పనులు ముగించుకుని రాత్రికి ఇంటికి చేరుకునే కార్మికులు రాత్రి 7:30 గంటల బస్సు సర్వీస్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ బస్సు ఎక్కితే రూట్‌లో ఉన్న గ్రామాల ప్రయాణికులు గంటలోపు ఇంటికి చేరుకో వచ్చు. ఈ బస్సు రద్దు కారణంగా బంటుమిల్లి రూట్‌లో ప్రయాణించే మహిళా ప్రయాణికులు పిల్లాపాపలతో రాత్రి సమయంలో అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ బస్సు రద్దుతో ఆటోలు, లారీలు, మినీ వ్యాన్‌లను ఎక్కి ఇళ్లకు చేరుకునేందుకు రాత్రిపూట మహిళా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుడివాడ ఆర్‌టిసి డిపో అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి కైనా గుడివాడలో రాత్రి ఏడు గంటలకు బంటుమిల్లికి వెళ్లే బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

అవగాహనా సదస్సులో కమాండింగ్ ఆఫీసర్ అమిత్ పాండే

ఎన్‌సిసిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - భీమడోలు

దేశ సేవలో పాలు పంచుకునేందుకు ఆసక్తి కలవారు ఎన్‌సిసి క్యాడెట్లుగా చేరాలని ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ అమిత్ పాండే కోరారు. భీమడోలు, గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌సిసి అవగాహనా కార్యక్రమాన్ని కళాశాల ఎన్‌సిసి అసోసియేట్ ఆఫీసర్ మల్లిశెట్టి గౌతమ్‌కుమార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అమిత్ పాండే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేందుకు ఎన్‌సిసి సహకరిస్తుందన్నారు. అదే క్రమంలో ఆరోగ్య పరిరక్షణలో సైతం తన వంతు సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. సెప్టెంబర్ ఆరో తేదీన ఎన్‌సిసిలో చేరేందుకు ఆసక్తి కలవారి కోసం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎంపికైన వారికి మరింత శిక్షణ కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు ఆర్.సత్యనారాయణ, ఉదయ్‌కిరణ్, వెంకటేశ్వరరావు, అంబేద్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ మల్లీశ్వరి

పల్స్ సర్వే వేగవంతం చేయాలి

ఎంపిడిఒ మల్లీశ్వరి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో చేపట్టిన పల్స్ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపిడిఒ పి.మల్లీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు డిడిఒలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిర్వహిస్తున్న పల్స్‌సర్వేను కార్యదర్శులు వెంటనే పూర్తి చేయాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 57 శాతం సర్వే జరగ్గా మిగిలిన ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. సర్వే పూర్తిచేసే విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శులు తమ విధులు నిర్వహించే విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సర్వే సక్రమంగా చేయని వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇఒపిఆర్‌డి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలానికి 6,400 మొక్కలు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 30వ తేదీన వన మహోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిడిఒలు పాల్గొన్నారు.

రూ.85 లక్షలతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - దెందులూరు

గత ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, గత పాలకులు వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసి అభివృద్ధి కుంటుపడేలా చేశారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం పునుకొల్లులో పునుకొల్లు - తోటగూడెం ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చింతమనేని మాట్లాడుతూ 2019 ముందు టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి నిధులు మంజూరు చేశామని, గత వైసిపి అసమర్థ పాలన వల్ల రహదారి నిర్మాణం చేపట్టలేదని చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రహదారులు అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు శ్రీనివాసరావు, పునుకొల్లు సర్పంచి కంభంపాటి సునీల్‌కృష్ణ, టిడిపి నాయకులు ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, గుత్త అనిల్, మోరు దశరథ్, మిక్కిలినేని ఈశ్వరరావు, దండమూడి సీతారాం ప్రసాద్, కొత్తూరు చినబాబు, ఎంపిడిఒ తేజరతన్, పంచాయతీరాజ్ ఎఇ మురళి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - కామవరపుకోట

రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు విధిగా బాధ్యత వహించాలని జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్ అన్నారు. స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. వాహనాలను అతివేగంగా నడపవద్దని సూచించారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రసన్నలక్ష్మి (ఫైల్‌ఫొటో)

స్థానిక కొత్తూరు చెక్‌పోస్ట్ సెంటర్‌లో బుధవారం ఉదయం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పని చేస్తున్న పి.నాగసాయిప్రసన్నలక్ష్మి(38) బుధవారం ఉదయం రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని మారుతీ నగర్ నుంచి యధావిధిగా తన భర్త బైక్‌పై పాఠశాలకు బయలుదేరింది. ఈ క్రమంలో కామవరపుకోట చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద ప్రసన్నలక్ష్మి అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడిపోయింది. అదే సమయంలో వెనుక వస్తున్న ట్రాక్టర్ ఆమె శరీరంపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త వి.రవికుమార్ తాడిచర్ల పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. తడికలపూడి ఎస్‌ఐ పి.చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రసన్నలక్ష్మి మృతిపై పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

నలుగురు యువకుల వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చింతలపూడి సిఐ ఎం.రవీంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి ఎస్‌ఐ కుటుంబరావుకు వచ్చిన సమాచారం మేరకు మేడిశెట్టివారిపాలెం వెళ్లే రోడ్డులో దేవుడు చెట్టు కింద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నలుగురు యువకులను తనిఖీ చేయగా వారి వద్ద కిలో గంజాయిని దొరికిందని, దానిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశామని తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.జయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన టి.నరసాపురం గ్రామానికి చెందిన మురాల సుజయ్, నక్షత్రకు 23 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె ఉంది. ఈ క్రమంలో తన భర్త సుజయ్ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని నక్షత్ర మూడేళ్ల ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా పుట్టింటికి వచ్చి వేధిస్తున్నాడని భార్య నక్షత్ర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలపై ఆకృత్యాలను నిరోధించాలి

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆర్‌డిఒ భవానిశంకరి

ప్రజాశక్తి నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ వై.భవానీశంకరి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలపై జరిగే ఆకృత్యాలను నిరోధించేందుకు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సకాలంలో స్పందించి విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీతో సమన్వయం ఏర్పాటు చేసుకుని ముందడుగు వేయాలని సూచించారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు అయ్యంకి సురేష్‌బాబు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ప్రతినెలా సివిల్ రైట్స్ డే పురస్కరించుకుని సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేకమైన న్యాయపరమైన అంశాలు, భారతీయ సంవిధానం 1950, వినియోగదారుల రక్షణ చట్టం 1986, సమాచార హక్కు చట్టం 2005, భారతీయ న్యాయ సంహిత 2023లపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి నెలా అవగాహనా సదస్సులు నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన కుటుంబాలపై ఆకృత్యాలు జరిగితే తక్షణమే కమిటీ సభ్యులకు సంబంధిత పోలీసు శాఖాధికారులు సమాచారం అందించాలన్నారు. ఇలాంటి సంఘటనల్లో బాధితులకు రక్షణగా నిలిచే విధంగా కేసులు నీరు కారకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఆర్‌డిఒ భవానీశంకరి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు మానిటరింగ్ కమిటీతో పాటు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు అండగా నిలవాలని చెప్పారు. ఈ సమావేశంలో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి, డివిజన్‌లోని తహశీల్దార్లు, నూజివీడు టౌన్ సిఐ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ : డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ఏలూరు :జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ప్రభుత్వం గ్రామ సచివాలయం సిబ్బందికి కూడా సాధారణ బదిలీల్లో అవకాశం కల్పించినందున గ్రేడ్-5 కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు భారీస్థాయిలో దరఖాస్తులు చేసుకున్నారు. బుధవారం చివరి రోజు కావడంతో బదిలీల కోసం కార్యదర్శులు డిపిఒ కార్యాలయానికి పోటెత్తారు. సిబ్బంది నుంచి దరఖాస్తులు స్వీకరించిన డిపిఒ శ్రీనివాసవిశ్వనాథ్ దరఖాస్తులు తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే బదిలీలు జరుగుతాయని చెప్పారు. ఐదేళ్లు పూర్తి చేసినవారికి తప్పని సరిగా బదిలీ ఉంటుందని, ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఖాళీలను భర్తీ చేస్తామని, బదిలీల్లో వికలాంగులకు, అనారోగ్యంతో బాధపడే వారికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. బదిలీల ప్రక్రియ పూర్తిగా నిబంధనల మేరకు పారదర్శకంగా జరుగు తుందన్నారు. దరఖాస్తులు పరిశీలనార్థం కార్యాలయపు సిబ్బందితో టీమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 800 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 30 తేదీ నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని, అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో బదిలీ ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ఎంఎల్‌ఎ తనిఖీలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని బుసరాజుపల్లి గిరిజన గురుకుల పాఠశాలను పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై పాఠశాల ప్రిన్సిపల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్తపట్టిసీమ గ్రామ పంచాయతీలో బుధవారం దోమల నివారణ కోసం ఫాగింగ్ కార్యక్రమం సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి అత్తిలి సుబ్రమణ్యం మాట్లాడుతూ పంచాయతీలో దోమల నివారణ కోసం అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోపవరం, ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక వైద్యులు షకీనా ఇవాంజిలిన్, వైద్యులు కరిముల్లా తెలిపారు. ఆయా గ్రామాల్లో 108 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆరుగురు జ్వర బాధితులను గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు.

పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం ఆరో డివిజన్ పరిధిలోని ప్రేమాలయంలో ఫ్యాన్స్ ప్రెసిడెంట్ దోసపర్తి రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉభయ గోదావరి జిల్లాల అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారా శేషు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెడ్డి అప్పలనాయుడు, నారా శేషును మెగా అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా వారం రోజులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. జనసేన నాయకులు నారా శేషు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇళ్ల శ్రీనివాస్, ఏలూరు నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, స్థానిక నాయకులు చిత్తిరి శివ, పడాల రాజు, కోలా శివ, తాండ్రంగి హరీష్, లోపింటి రాజేష్, పొన్నూరు రాము, మెగా అభిమానులు శానం రామకృష్ణ, పెదబాబు, ఈదుపల్లి కాశీ పవన్, కట్టా ఆది, అరవింద్, పండు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం తొమ్మిది మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించామని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆ వ్యాధుల బాధిత చిన్నారులు ప్రతి బుధవారం రెడ్‌క్రాస్ భవనానికి వచ్చి రక్త మార్పిడి చికిత్స తీసుకోవాలని కోరారు. ఈరోజు తలసేమియా చిన్నారులు, వారి సహాయకులకు 25 మందికి మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటుచేసిన నెక్కంటి రామచంద్రరావు, సీతామహాలక్ష్మి దంపతులకు, ప్రోటీన్ పౌడర్, ఎండ్లను పంపిణీ చేసిన ఏలూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్‌జివి బి.స్వామికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాదరావు, చిన్నపిల్లల వైద్యుడు పిఎఆర్‌ఎస్.శ్రీనివాస్, డాక్టర్ జి.స్పందన, సిఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎన్‌వివిఎస్.ప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు ఎన్‌జివిబి.స్వామి, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - చింతలపూడి

జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని చింతలపూడి, తడికలపూడి, ధర్మాజీగూడెం, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో వినాయక చవితి మండపాలు నిర్మించేవారు పోలీసుల అనుమతి తీసుకోవాలని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర తెలిపారు. సర్కిల్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు వారు అందుకు సంబంధించి ప్రత్యేకమైన అప్లికేషన్ తయారు చేశారని తెలిపారు. ఆ మండలాల ఎస్‌ఐలను కలవాలన్నారు. ఆ మండపం ఎక్కడైతే పెట్టాలనుకుంటున్నారో ఆ స్థలానికి సంబంధించిన యజమాని వద్ద నుంచి ఎన్‌ఒసి సర్టిఫికేట్, మండపానికి వాడుకునే విద్యుత్ సరఫరా ఎలక్ట్రికల్ ఎఇ దగ్గర నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పారు. .

తప్పించుకునే ధోరణిలో అధికారులు!

ప్రజాశక్తి - ముదినేపల్లి

జోరుగా బుసక అక్రమ వ్యాపారం అనే కథనం మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. మండలంలో చిగురుకోట, బొమ్మినంపాడు రూట్లలోని గరువు గ్రామాల్లో జరుగుతున్న బుసక అక్రమ వ్యాపారంపై రెవెన్యూ అధికారులు తప్పించుకునే ధోరణిలో వ్యవహరించడం గమనార్హం. వార్తా సేకరణ కోసం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన ప్రజాశక్తి విలేకరిపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) రుసరుసలాడారు. వేరే మండలం నుంచి బుసక అక్రమ వ్యాపారం సాగుతుంటే ముదినేపల్లి మండలంలో బుసక అక్రమ రవాణా జరుగుతున్నట్లు వార్తలు రాయటం సరికాదన్నారు. గ్రామస్థాయి రెవెన్యూ అధికారులను బుసక అక్రమ రవాణాపై ఆరా తీసినట్లు తెలిపారు.

పోలవరంలో 'పొలంబడి'

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి రాంబాబు మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో 25 ఎకరాలకు 30 మంది రైతులను ఎన్నుకుంటారని, ప్రతి బుధవారం క్షేత్రస్థాయిలో 14 వారాలు పొలంబడి కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి అవగాహన

ఏలూరు సిటీ :సిఎం చంద్రబాబు ప్రతిపాదించిన వీక్షిత్ ఎపి 2047పై మెప్మా ఆధ్వర్యంలో స్థానిక పీడీ మెప్మా వారి కార్యాలయంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెప్మా పీడీ బి.ప్రియంవద హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బంది పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పురపాలక సంఘాలు, కార్పొరేషన్‌లో నిర్దేశించిన టార్గెట్స్, లోన్లు, బ్యాంకు లింకేజీ కార్యక్రమాలపై ప్రాజెక్ట్ డైరెక్టర్ చర్చించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ రాజాజీ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. నైబర్హుడ్ యూనిట్లపై స్పెషలిస్టులు ఝాన్సీ, దీప, పార్వతి, మోహన్ వివరించారు.

ట్రై సైకిల్ అందజేత

ముదినేపల్లి :కైకలూరు మండలంలోని జాన్‌పేటకు చెందిన దాసరి శ్రీను అనే వ్యక్తికి రెండు కాళ్లు పనిచేయకపోవడంతో తన సొంత పనులు చేసుకునేందుకు కూడా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని టిడిపి గ్రామ అధ్యక్షుడు రాయినుతల సునీల్ ద్వారా టిడిపి యువనేత కొడాలి వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వినోద్ వెంటనే స్పందించి బొర్రా బాలసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా శ్రీనుకు ట్రై సైకిల్ అందించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని ఎపి వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్ భానుప్రతాప్‌ను శ్రీనివాసరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు జనరల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 2006, 2012, 2018, 2024 సంవత్సరాలకు సంబంధించి ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. మెడికల్ లీవ్ బిల్లులు చెల్లించాలని, రిటైర్‌మెంట్ అయిన అనంతరం కార్మికులకు చెల్లించాల్సిన ప్రయోజనాలన్నీ తక్షణం చెల్లించాలని కోరారు. రిటైర్‌మెంట్ అయిన కార్మికులకు జిఐఎల్ చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు ఎపి జిఐఎల్ చెల్లించాలన్నారు. మరణించిన మున్సిపల్ వర్కర్స్‌కి దహన క్రియల ఖర్చులకు వెంటనే నగదు చెల్లించాలన్నారు. అవుట్‌సోర్సింగ్, ఆప్కాస్ కార్మికులకు బకాయి ఉన్న ఫిబ్రవరి నెల హెల్త్ అరియర్స్ తక్షణం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏలూరు నగర యూనియన్ అధ్యక్షులు యలగాడ దుర్గారావు, యలగాడ శివకుమార్, కసింకోట నాగేంద్ర, పుచ్చ శంకరరావు, పైడి శంకర్, సోమాదుల కుమార్, దుర్గారావు, ఇంటి అశోక్, గంటా జానకిరామ్, అల్లం పెద్దిరాజు, బంగారు గణేష్, బండి సతీష్, భాస్కరరావు, రవికుమార్, కారే దాసు, రాజ్ కిరణ్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I Alla Harisha , W/o Alla Satish Chowdary , and Residing at D.No: 10-142, Alla Murali Krishna Road, Vatluru (V) , Pedapadu (M) Eluru Dt, A.p. Changing My Name from Alla Hareesha (Old Name) to **Alla Harisha** (New Name) Hence forth I am Being Called as **Alla Harisha** (New Name) For All Purposes

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సూచనల మేరకు పంటలపై పురుగుమందులు మోతాదును బట్టి పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ రైతులకు సూచించారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో మేలైన యాజమాన్యం పద్ధతులు కార్యక్రమంలో భాగంగా పంట యాజమాన్యం పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలు వాడి అధిక దిగుబడి పొందాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులు, విషపూరిత ఎరువులు తగ్గించి, క్రిమిసంహారక మందులు వాడకం పూర్తిగా మానేసి పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రామకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'చంద్రబాబు నిర్ణయం హర్షణీయం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న నిర్ణయాలు హర్షణీయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మూడు నెలల్లోనే సిఎం చంద్రబాబు రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. అన్న క్యాంటీన్ ఏర్పాటుచేసి కేవలం ఐదు రూపాయలకే పేదలకు భోజనం అందిస్తూ అనేకమంది ఆకలి తీర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఆలయ అర్చకుల వేతనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.15 వేలకు పెంచిందన్నారు. అదేవిధంగా ఆలయ ధూప దీప నైవేద్యాలకు నెల నెలా ఇచ్చే రూ.ఐదు వేలను రూ.పది వేలకు పెంచడం, నాయీ బ్రాహ్మణులకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.25 వేలకు పెంచడం అభినందనీయమన్నారు. ఆర్య వైశ్యులు కుల దేవతగా కొలుచుకునే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకున్న రోజును అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ వారికి సూచించడం పట్ల పలువురు ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నాయుడుగూడెంలో 'మీకోసం - మీ చింతమనేని'

ప్రజాశక్తి - దెందులూరు

పెదపాడు మండలంలోని నాయుడుగూడెంలో బుధవారం నిర్వహించిన మీకోసం-మీచింతమనేని కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్తుల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించి, వాటిపై సంబంధిత అధికారులతో చర్చించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ♦ DEPOSITS Translating Dreams into Reality
25-13-4/1, 1వ అంతస్తు, ఎన్.ఆర్. ప్లాజా, మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు, నరసింహారావుపేట, ఏలూరు - 534006. ఏలూరు జిల్లా, ఎపి.
Tel: 08812-245245,76250 79240. Email : eluru@canfinhomes.com

అమ్మకం నోటీసు

రూల్ 8 (6) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002

టూ,
1) శ్రీ / శ్రీమతి కింజంగి వెంకట నాగరాజు (ఋణగ్రహిత) హెచ్.నెం. 4-29, బిడి కాలనీ, మసీదు దగ్గర, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి, ఏలూరు జిల్లా, ఎపి - 534006. **2) శ్రీమతి కంజంగి లలిత** (సహా ఋణగ్రహీత) హెచ్.నెం. 4-29, బిడి కాలనీ, మసీదు దగ్గర, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి, ఏలూరు జిల్లా, ఎపి - 534006. **3) శ్రీ పలకలూరి గోవిందె** (హామీదారు) హెచ్.నెం. 9.305/2, గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, గాంధీనగర్, నూజివీడు, కృష్ణా జిల్లా, ఎపి - 521201
మీలో నెం.1 & 2 మా బ్రాంచి నుండి **మీలో నెం. 2**కి చెందిన క్రింది ఆస్తికి సంబంధించిన తనఖా భద్రతకు వ్యతిరేకంగా హౌసింగ్‌లోన్ ను పొందారు. ఖాతా ది. 29-06-2024న ఎన్.పి.ఎ. గా వర్గీకరించబడింది మరియు ఆ తర్వాత ది. 04-07-2024 నాటి డిమాండ్ నోటీసు ద్వారా బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లించాల్సిందిగా మిమ్మల్ని పిలిచారు.

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు :

ఎ.పి. - 534005, ఏలూరు, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, డి.నెం. 24ఎ-6-15/1, టి.ఎస్.నెం. 5, అశోక్‌నగర్, డబ్ల్యూ.పి. వార్డు, పాత 20వ వార్డు, ప్రజెంట్ డివిజన్ నందు 64-4-0 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి. **హద్దులు : ఉత్తరం :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** సెయింట్ ఆల్ఫాన్స్ లిటిల్ సిస్టర్స్ బిల్డింగ్, **తూర్పు :** శన్యం, **పడమర :** మున్సిపల్ రోడ్డు.

సదరు మొత్తం బ్యాంక్‌కు చెల్లించడంలో విఫలమైనారు. కావున బ్యాంక్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తిని సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (4) రూల్ 8 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం స్వాధీనం చేసుకోవడం జరిగినది.

బ్యాంక్ వారు దిగువ ఆస్తిని అమ్మి తమకు రావలసిన మొత్తం **ది. 04-07-2023 నాటికి రూ. 21,06,308/-** మరియు సదరు మొత్తముపై వడ్డీ, ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో సహా రాబట్టుకొనెదరు. స్వాధీనత నోటీసును రిజిస్టర్ పోస్టు ద్వారా ఋణగ్రహీతల చివరి చిరునామాకు పంపడం జరిగినది. నోటీసు ధృవీకరించబడలేదు. కావున ఈ పత్రిక ప్రకటన ప్రచురించబడుతుంది.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 8 (6) క్రింది ఇదే చివరి నోటీసుగా పరిగణించబడుతుంది. ఈ నోటీసు తేది నుండి 30 రోజుల వ్యవధిలో మొత్తం బకాయిని చెల్లించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఇందులో విఫలమైనచో, దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క నిబంధనల ప్రకారం బకాయిని తిరిగి రాబట్టుకొనుటకు వేలం తేదిని నిర్ణయించడం, వేలం నోటీసును ప్రచురించడం మరియు స్థిరమైన సురక్షిత ఆస్తిని విక్రయించడం జరుగుతుంది.

తేది : 28-08-2024
ప్రదేశం : ఏలూరు
సం/- అధీకృత అధికారి
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ♦ DEPOSITS Translating Dreams into Reality
25-13-4/1, 1వ అంతస్తు, ఎన్.ఆర్. ప్లాజా, మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు, నరసింహారావుపేట, ఏలూరు - 534006. ఏలూరు జిల్లా, ఎపి.
Tel: 08812-245245,76250 79240. Email : eluru@canfinhomes.com

అమ్మకం నోటీసు

రూల్ 8 (6) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002

టూ,
1) పలివెల కమల (లేటు) గారికి చెందిన చట్టపమైన వారసులు అందరు, భర్త : పలివెల ఏసుపాదం (లేటు), డోర్ నెం. 4-58, రామేశ్వరం రోడ్డు, జుట్టిగ, పెనుమంత్ర గ్రామం & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఎపి, ఇండియా - 534124. **2) శ్రీ పలివెల నరేంద్రబాబు,** తండ్రి : పలివెల ఏసుపాదం (లేటు), డోర్ నెం. 4-58, రామేశ్వరం రోడ్డు, జుట్టిగ, పెనుమంత్ర గ్రామం & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఎపి, ఇండియా - 534124. **3) కోపూరి లక్ష్మి** (హామీదారు) భర్త : సూర్యారావు, డోర్ నెం. 1-138/2, జిన్నూరు, పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఎపి, ఇండియా - 534265.
మీలో నెం.1 & 2 మా బ్రాంచి నుండి **మీలో నెం. 1**కి చెందిన క్రింది ఆస్తికి సంబంధించిన తనఖా భద్రతకు వ్యతిరేకంగా హౌసింగ్‌లోన్ ను పొందారు. ఖాతా ది. 29-06-2024న ఎన్.పి.ఎ. గా వర్గీకరించబడింది మరియు ఆ తర్వాత ది. 04-07-2024 నాటి డిమాండ్ నోటీసు ద్వారా బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లించాల్సిందిగా మిమ్మల్ని పిలిచారు.

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు :

ఎ.పి. - 534124, పశ్చిమ గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి రిజిస్ట్రేషన్ జిల్లా, అత్తిలి సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పెనుమంత్ర మండలం, జుట్టిగ గ్రామం, రామేశ్వరంరోడ్డు, నల్లిమిల్లి వెంకటరెడ్డి కాలనీ, ఆర్.ఎస్.నెం. 32, ప్లాట్ నెం. 38, డి.నెం. 4-21 వద్ద 96.56 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి. **హద్దులు : ఉత్తరం :** రోడ్డు, **దక్షిణం :** రోడ్డు, **తూర్పు :** కొవ్వూరి పెద సోమిరెడ్డి గారి స్థలము, **పడమర :** ప్లాట్ నెం. 37 స్థలము.

సదరు మొత్తం బ్యాంక్‌కు చెల్లించడంలో విఫలమైనారు. కావున బ్యాంక్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తిని సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (4) రూల్ 8 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం స్వాధీనం చేసుకోవడం జరిగినది.

బ్యాంక్ వారు దిగువ ఆస్తిని అమ్మి తమకు రావలసిన మొత్తం **ది. 04-07-2023 నాటికి రూ. 10,35,418/-** మరియు సదరు మొత్తముపై వడ్డీ, ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో సహా రాబట్టుకొనెదరు. స్వాధీనత నోటీసును రిజిస్టర్ పోస్టు ద్వారా ఋణగ్రహీతల చివరి చిరునామాకు పంపడం జరిగినది. నోటీసు ధృవీకరించబడలేదు. కావున ఈ పత్రిక ప్రకటన ప్రచురించబడుతుంది.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 8 (6) క్రింది ఇదే చివరి నోటీసుగా పరిగణించబడుతుంది. ఈ నోటీసు తేది నుండి 30 రోజుల వ్యవధిలో మొత్తం బకాయిని చెల్లించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఇందులో విఫలమైనచో, దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క నిబంధనల ప్రకారం బకాయిని తిరిగి రాబట్టుకొనుటకు వేలం తేదిని నిర్ణయించడం, వేలం నోటీసును ప్రచురించడం మరియు స్థిరమైన సురక్షిత ఆస్తిని విక్రయించడం జరుగుతుంది.

తేది : 28-08-2024
ప్రదేశం : ఏలూరు
సం/- అధీకృత అధికారి
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్